# 39. ఓడిపోయాను

జీవితంలో చాలసార్లు నేను ఓడిపోయాను. అందుచేత ఓటమి అంటే నేను విచారించను. కానీ......

సరిగ్గా పది గంటలకు కుర్చీలో కూర్చున్నాను. చాల పనుంది. మూడువేల టియేజర్నల్సు - సాయంకాలం వరకు పని చేసినా ముగియని పని.

"సార్! ఎవరో అసిస్టెంటు మిమ్మల్ని కలుస్తానంటున్నాడు." అన్నాడు చప్రాసీ.

"ఇవాళ చాలా పనుంది రేపు రమ్మను."

"చాలా అర్జంటుగా మిమ్మల్ని కలవాలట - అతని పేరు ధర్మారావని, కిందటి సంవత్సరం రైలు ప్రమాదంలో దెబ్బతిన్నాడని మీకు చెప్పమన్నాడు."

ధర్మారావు కోసం అన్ని పనులు వెనకబెట్టాను. కిందటి సంవత్సరం రెండు రైళ్లు ఒకదానితో ఒకటి అభిముఖంగా గుద్దుకున్నాయి. ధర్మారావు పని చేస్తున్న ట్రెయిను స్టేషనులో నిలబడి వుంది. డ్రైవరు స్టేషను మాస్టరు దగ్గిరికి వెళ్ళాడు. ధర్మారావు యింజనుమీద ఉన్నాడు. ఎదురుగా వస్తున్న ఎక్స్‌ప్రెస్, పక్కలైను మీద నుంచి పోకుండా, తన రైలు వున్న లైనుమీదికి రావడం చూసి, తొందరగా ఇంజను నుండి దిగిపోడానికి ప్రయత్నించాడు. కానీ, ఆఖరి క్షణంలో ఇంజన్లు రెండూ గుద్దుకొని, అతను ఇరవై గజాల దూరానికి పోయి పడ్డాడు. అప్పుడతని ముఖం పచ్చడయింది. పళ్లన్నీ రాలిపోయాయి. పై పెదవీ, ముక్కూఓ కొంత భాగం తెగిపోయాయి. కింగ్ జార్జి హాస్పిటల్ లోని సర్జనులు మూడు గంటలు ఆపరేషను చేసి అతనిని బతికించారు. అతనక్కడ మూడు నెలలున్నాడు, మరో మూడు నెలలు రైల్వే హాస్పిటలులో వున్నాడు. మరో మూడు నెలలు ఇంట్లో వుండి ట్రీట్‌మెంట్ తీసుకున్నాడు. ఏదో రికార్డు అసిస్టెంటుగా షెడ్‌లో వేసి జీతమిస్తున్నాం.

"ధర్మారావుని! వెంటనే తీసుకురా!"

ధర్మారావు నమస్కారం చేశాడు.

"ఎలా ఉన్నావ్? ధర్మారావ్!" అడిగాను.

"బాగానే ఉన్నాను సార్!"

"మరి ఏమిటి ఇబ్బంది?"

"సార్! మీకు తెలుసు, నేను ఆరు నెలలయి స్పెషలిస్టు దగ్గిర ట్రీట్ మెంటు

తీసుకుంటున్నట్టు, నేను మందులకింద వెయ్యి రూపాయల వరకు చేతి సొమ్ము ఖర్చు పెట్టాను. మందుల రసీదులు జతపరిచి, ఆ సొమ్ము యిప్పించమని రెండు నెలల కింద అప్లికేషను పెట్టుకున్నాను."

"అవును వెంటనే బిల్లు చేయమని ఆ రోజే సెక్షన్‌కి పంపించాను. డబ్బింకా దొరకలేదా?'

'లేదుసార్!'

"గుమస్తా రామారావుగారిని కలిసి నేను పంపించినట్టు చెప్పు"

"వారం రోజులై చెప్తున్నానుసార్!"

"అతనిని పిలుచుకురా!"

"అతనీరోజు సెలవు పెట్టారు."

"మరి......"

"అతను నా అప్లికేషను, రసీదులు కనిపించలేదంటున్నారు."

"అయితే?"

"అవిపోతే నా వెయ్యి రూపాయిలు పోయినట్టే.."

"అదెలా అవుతుంది?"

"మళ్ళీ రసీదుల డూప్లికేట్లు సంపాదించిలి. డాక్టర్ల సంతకాలు. తతంగ మంతా మొదలు పెడితే మరో ఆరు నెలలు పడుతుంది."

నేనాలోచిస్తున్నాను, ఏం-చె య్యడమని.

"సార్! నా దగ్గిర డబ్బు లేకపోతే ఒకతని దగ్గిర అప్పుడూ అప్పుడూ అప్పుచేస్తూ వచ్చాను. అలా ఆ అప్పు రెండు వేలవరకూ పెరిగింది. కనీసం ఒక అయిదు వందలైనా యీ సాయంకాలానికి ఇవ్వకపోతే అతను ఒప్పుకోనన్నాడు. నాట్రీట్ మెంటుకి ఇంట్లోని పాత్ర సామాన్లు సైతం అమ్మివేశాను. అతనికి ఈ అయిదు వందలూ యిస్తే మళ్లీ సహాయం చేస్తాడు."

"చాల ఇబ్బంది వచ్చి పడిందే! అతనో వారం రోజులు వుండలేడా?"

"నాలుగు వారాలయి అతన్ని తిప్పుతున్నాను. ఈసారి యివ్వకపోతే అతను."

"ధర్మారావు....... కొంచెం ఆగు. ఆలోచించనీః"

"ఏదో చేసి నాకు సాయంకాలానికి డబ్బు ముట్టే ఏర్పాటు చేయండిసార్!"

ఆలో చించడానికి ఏమీలేదు. నేను స్వయంగా ఒక సెక్షన్‌లో కూర్చుంటే, పని అవుతుందేమో!

అన్నిటికన్న ముందు మెడికల్ రసీదులు, అప్లికేషను పైకి తియ్యాలి.

అనుకున్నట్టే ఆఫీసు, సూపరింటెండెంట్, గుమస్తా వచ్చే దాకా ఆగమన్నాడు. మరునాడు సెలవు. తరువాత ఆదివారం.

"మీ దగ్గిర రామారావుగారి డ్రాయరు తాళం, డూప్లికేటు, వుంటుంది. పదండి ఒకసారి తీసి చూద్దాం!"

"ఆ పని బాగుండదు సార్!"

"ఎమర్జెన్సీకే తెరచినట్టు వ్రాయండి. నేను సంతకం పెడతాను"

ఏ సంతకం అక్కరలేకుండానే డ్రాయరు తెరచుకుంది.

కాగితాలతో అది నిండిపోయింది. కాగితం తరువాత కాగితం, కేసు తరువాత కేసు తీస్తే, చిట్టచివరకు ధర్మారావు అప్లికేషను, రసీదులు బయటపడ్డాయి.

అక్కడితో పనికాలేదు.

ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్య తనీ బిల్లు చెయ్యలేనన్నాడు. నాకు బాగా తెలిసిన గుమస్తా ఒకడు ముందుకొచ్చాడు.

బిల్లు తయారయేసరికి పన్నెండున్నర.

దానిని మామూలు పద్ధతిలో అకౌంట్సుకి పంపుతే మరునాటి మధ్యాహ్నం అందుతుంది.

కేసు నేనే పట్టుకొని అకౌంట్సుకి వెళ్లాను. బిల్లులు చూస్తున్న సీనియర్ గుమస్తా నవ్వుతూ పలకరించాడు. అతని పక్కనే కుర్చీలో కూర్చున్నాను..

ధర్మారావు కేసు అతని చేతిలో పెట్టాను. అతను జాగ్రత్తగా దానిని చూశాడు.

"అంత అర్జంటా?" అతనడిగాడు.

"పాపం! ఈ ధర్మారావు చాలా యిబ్బందిలో వున్నాడు."

"అయితే రెండు గంటలకి ఎవరినైనా పంపండి."

ఆ మధ్యాహ్నం నేను లంచ్‌కి పోలేదు. ధర్మారావు బిల్లు వస్తే వెంటనే చెల్లించమని కాషియరుకు ఫోను చేస్తూ ఉండిపోయాను.

రెండు గంటలకు ధర్మారావుతో నేను వెళ్లాను. మూడు గంటలకు బిల్లు తెచ్చి ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్యకు స్వయంగా యిచ్చి, బంట్రోతుతో కాషియరుకు బిల్లు పంపించి, సాయంకాలం అయిదులోగా పేమెంటు చేయించమని నొక్కి చెప్పాను.

"అదెంత పనిసార్! మీరింక నిశ్చింతగా వెళ్ళిపోవచ్చు. అంతా నేను చూసుకుంటాను' ' అభయమిచ్చాడు ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్య.

ధర్మారావుతో చెప్పి నా సీటుకు వచ్చాను.

అప్పటికి మూడుగంటలయింది.

ఏదో మంచి పని చేశానని ఆనందిస్తూ, రాత్రి తొమ్మిది వరకూ కూర్చుండి సంతకాలు పూర్తిచేశాను.

ఒక వారం రోజుల్లో నాకు ఖర్గపూర్ బదిలీ అయింది. మరి ధర్మారావుని వెంటనే కలియలేకపోయాను.

* * *

ఖర్గపూర్‌లో రైలు పెట్టెలు పునర్నిర్మించే శాఖకు అధికారిగా వుండేవాడిని. మూడు వేల మంది నాకింద పనిచేసేవారు. మంచి హోదా, అధికారం చేతిలో వుండేవి.

ఒక రోజు లంచ్‌కి బయలుదేరుతుంటే, ఆఫీసు వరండాలో రంగారావు కలిశాడు. అతను పెయింట్ షాపులో పనిచేస్తున్నాడు. అతను పాలిష్ చేసిన దానిమీద ముఖం చూసుకోవచ్చు. మంచి పనివాడు. అతనికో అవార్డు కూడా ఇప్పించాను.

"ఏం రంగారావు?" అతని నమస్కారం స్వీకరించి అడిగాను.

"సార్! మరో ఆరు నెలలలో నేను రిటైరవుతున్నాను - ఈ సంగతి మీకు తెలుసు..."

"అవునవును"

"మా అబ్బాయి మా షాపులోనే పనిచేస్తున్నాడు. ఆరు నెలలబట్టి ఇంటద్దె వాడు పుచ్చుకోవడం లేదు."

"ఆహా!"

"దయచేసి నేనుంటున్న ఇల్లు వాడిపేర బదిలీ చేస్తే..."

"మధ్యాహ్నం రా! సీనియర్ గుమస్తా ఉత్తమ శీలన్‌తో చెప్పి , కేసు నాకు పంపించమను.'

"అతనితో చెప్తాను... కాని అతనో అడ్డు పెడుతున్నాడు సార్!"

"ఏమిటది?"

"యూనియన్ మెంబర్లు ఆ ఇంటి కోసం ప్రయత్నిస్తున్నారని, అందుచేత దొరకదని చెప్పాడుసార్!"

"మరో ఇల్లయితే?"

"ఈ ఇల్లు లైను చివరనుంది - చాలా ఖాళీస్థలముంది. నేనో చిన్నగది వేసుకుంటే అందరం ఒక ఇంట్లోనే వుండవచ్చు."

"సరే రేపు యూనియన్ మెంబర్లతో మీటింగుంది. వాళ్ళతో చెప్తాను - ఎల్లుండి మళ్ళీ కలియవలసింది...."

మరునాడు యూనియన్ మెంబర్లతో మాట్లాడాను. అందులో ఒకాయన ఆ ఇంటి కోసం ప్రయత్నిస్తున్నాడు. అంతకన్న మంచి ఇల్లు మరోకటి అతనికిచ్చి, రంగారావు ఇంటికి అభ్యంతరాలు లేవని విళ్ళ చేత సంతకాలు పెట్టించాను.

నేను ఛార్జి తీసుకున్నప్పుడు తన గుమస్తాలను పరిచయం చేశాడు, ఆఫీసు సూపరింటెండెంటు. అప్పుడు మొదటిసారి ఇళ్ళు ఇచ్చే గుమస్తాను కలిశాను.

"నా పేరు ఉత్తమ శీలన్ సార్! సీనియర్ క్లర్క్‌ని"

ఆ పేరు వింటే ఎవరో చెంప మీద కొట్టినట్టయింది. ఈ నేతి బీరకాయ ఎవరని నిదానించి చూశాను -

"నేను రూల్సు ప్రకారం పోతాను సార్? అందుకే చాలామంది పనివాళ్ళకి నేనంటే కోపం"

నేనతడి మాటలు విని నవ్వాను - మరేం జవాబు చెప్పలేదు.

ఉత్తమశీలన్ చాలా మెల్లగా మాట్లాడేవాడు. వినయంతో వ్యవహరించే వాడు. ఆఫీసు పని చాలా చక్కగా చేసేవాడు. అతని గురించి నాకున్న అనుమానాలను తొలగించాడు.

రంగారావు అనుకున్నట్లే మరునాడు వచ్చాడు. సీనియర్ గుమస్తా కేసు పట్టుకు వచ్చాడు.

"ఉత్తమ శీలన్?"

"ఎస్. సార్!"

"రంగారావు ఇంటిని అతని కొడుకు పేర బదిలీ చేస్తూ ఆర్డర్లు తయారు చేయండి. యూనియన్ మెంబర్ల ఆమోదం వుంది. రూల్సు కూడా ఒప్పుకుంటాయి."

"కేసు మరోసారి చూడనివ్వండి సార్!"

"నేను చెప్తున్నాను కదా! ఆర్డర్లు తయారు చెయ్యండి. నేను సంతకం చేస్తాను. ఎవరేనా ఇంకా ప్రశ్నిస్తే, రంగారావు చాలా గొప్ప పనివాడనీ, అతని సేవలకు యాజమాన్యం చాలా ఋణపడి వుందనీ నేను రాస్తాను"

అతను మరేం జవాబు చెప్పలేదు.

నాకు వాగున్లు బాగుచేసే శాఖకు బదిలీ లయింది. వెళ్లిపోయే ముందు రంగారావు ఇంటి బదిలీ ఆర్డర్లు సంతకం చేసి మరీ కదిలాను.

ఇది మరో విజయం - విజయం అనడంకన్నా ఒక మంచి కళాకారుడికి ఉపకారం చేశానన్న సంతోషంతో....

* * *

ఒక రోజు విశాఖపట్నం స్టేషన్లో ధర్మారావు కనిపించాడు. నాకో నమస్కారం పారేసి తన దారిని వెళ్ళిపోతున్నాడు. ఆరోజుల్లో శ్రమపడి డబ్బు ఇప్పించిన సంగతి ఇంత వేగంగా మరచిపోయినందుకు నాకు విచారం కలిగింది. అతని డబ్బు అతనికి ఇప్పించడంలో గొప్పేముంది?

"ధర్మారావు ఇలారా!"

వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.

అతనిని ఏమని అడగాలి?

"నీ ఆరోగ్యం బాగుందా?"

"బాగుందిసార్?"

"అన్నట్టు ఆ రోజు సాయంకాలం నీకు డబ్బు ముట్టిందా?"

అతను నసుగుతూ అన్నాడు, "ముట్టింది సార్!"

"వెంకట్రామయ్య మాట కొట్టేయకుండా...."

"అదేనుసార్?"

అతను మనసులో ఉన్నదేదో చెప్పలేకపోతున్నాడు.

"నా దగ్గిర నీకు దాపరికం దేనికి?"

"ఏం చెప్పడం - వాళ్ళింటికి రాత్రి గెస్టులు వస్తున్నారని, పరుగెత్తి రెండు కిలోల కోడి మాంసం ఇంట్లో ఇచ్చినట్టు టెలిఫోన్ వచ్చే దాకా బిల్లు కాషియర్ దగ్గిరకు పోదన్నాడు."

ధర్మారావుకి ఆ విధంగా డబ్బుముట్టింది........

రంగారావు ఒకనాడు బజారులో కనిపించాడు. నన్ను చూసీ చూడనట్టు వెళ్ళిపోతున్నాడు.

"రంగారావ్!" నేను పిలిచాను.

అతను రిటైరయ్యాడు - స్వతంత్రుడు - కనీసం నమస్కారం కూడా చెయ్యలేదు.

"ఏమయింది, అంత కోపంగా వున్నావ్?"

"మా వంటివాళ్ళకు కోపముంటే ఏం ప్రయోజనం - మీరందరూ నాకు ఇల్లు ఉచితంగా ఇచ్చినట్టు సంబరపడ్డారు."

"మరి......."

" ఆ ఉత్తమశీలన్ ఎదాన మూడు వేల రూపాయిలు కొట్టిన తరువాత ఆర్డర్లు నా చేతికి వచ్చాయని మీకు తెలుసా?"

నాకు తెలియదు.

వెంకట్రామయ్యలు, ఉత్తమశీలన్లు లోకంలో ఉన్నంత కాలం గెలుపొదండం జరగదు.

వాళ్ళ ముందు నేను చిత్తుగా ఓడిపోయాను.

ఆంధ్రజ్యోతి - దీపావళి సంచిక

☆